క్లుప్తంగా

18 నుంచి ఆరాధన మహోత్సవాలు



తెనాలి రూరల్: మండలంలోని కఠెవరం గ్రామ క్షత్రియ నగర్‌లో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 74వ ఆరాధన మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహోత్సవాల వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. తొలిరోజు పూజా కార్యక్రమాలతో ప్రారంభమవుతాయని, భక్త చింతామణి, శ్రీకృష్ణ రాయబారం, హరిశ్చంద్ర, బ్రహ్మం గారి నాటకాలు ప్రదర్శిస్తారని తెలిపారు. ఆలయ పూజారి పూసపాటి శ్రీనివాసరావు, వెంకం రాజు, గోపిరాజు, నటరాజు, సిద్ధం రాజు పాల్గొన్నారు.

ప్రారంభమైన వాసవీమాత వేడుకలు



తెనాలి రూరల్: సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో గురువారం నుంచి శనివారం వరకూ జరుగుతున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి వేడుకలలో భాగంగా మొదటి రోజు విశేష కార్యక్రమాలు జరిగాయి. బాలస్వామీజీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నుంచి అమ్మవారికి పూజలు చేశారు. వాసవీ అమ్మవారు వాసవీవి విద్యాధరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పంచామతాభిషేకాలు, పుష్ప సహిత కుంకుమార్చన, సామూహిక వాసవీ మాత సంకీర్తనలు నిర్వహించి అమ్మవారి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో మఠం చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, ఉప్పల నాగేశ్వరరావు, గోపు రామ కృష్ణ, కమిటీ సభ్యులు, జయలక్ష్మి మాత మండలి, శ్రీ లలితా సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక ఇందిరానగర్‌లో తాగునీటి సమస్య ఏర్పడడంతో కార్పొరేషన్ అధికారులు గురువారం నుంచి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. డీఈ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కొండవీటి వాగులో నీటిమట్టం తగ్గడంతో భూగర్భ జలాలు అడుగంటాయని, కృష్ణాయపాలెం సమీపంలో వున్న ఇందిరానగర్‌లో ఉన్న చేతి పంపుల నుంచి తాగునీరు రాకపోవడంతో సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఇందిరానగర్‌కు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందజేస్తున్నామని, త్వరలోనే ఆ ప్రాంతానికి కూడా పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

63,744 మంది ఓటు వేయలేదు!

'ఓటు అనేది నువ్వు వేస్తే ఇంకొకరు గెలవడం కాదు. ఎవరికి ఓటు వేస్తే నువ్వు గెలుస్తావో వారికే నీ ఓటు వేయ్యి' అని ఎంతమంది మొత్తుకున్నా చాలామంది ఓటర్లు ఓటు వేసేందుకు తెనాలి నియోజకవర్గంలో ముందుకు రాలేదు. ఓటన్నది రెండువైపులా బాగా పదునుదేలిన కత్తివంటిది. అది మంచిని గెలిపించి చెడును ఓడిస్తుందన్నది వాస్తవం. ఐదేళ్లపాటు మనల్ని పాలించే వ్యక్తిని ఎన్నుకోవడంలో ఎంతో కీలకమైన ఓటు వేయడానికి వేల మంది రాలేదన్న అధికారిక లెక్కలు పలువుర్ని ముక్కున వేలేయిస్తున్నాయి. ఓటు వేసేందుకు కావల్సిన సదుపాయాలన్నీ యంత్రాంగం సమకూర్చినా ఎందుకనో కేంద్రాల వైపునకు ఈ ఓటర్లంతా రాలేకపోవడం ఒకింత బాధాకరమే.



ఓటు ప్రాధాన్యతపై ఎడ్లబండిపై ప్రచారం చేస్తున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న (ఫైల్)

- పట్టణంలో అత్యధికంగా 48,833 మంది
- రూరల్ మండలంలో 9,808
- కొల్లిపర మండలంలో 5,103

తెనాలి: ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైనది... ఓటు అనే ఆయుధంతో సమర్థులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకోవచ్చు... అయిదేళ్ల పరిపాలనకు ఓటరుగా పాలకులకు ఇచ్చే అవకాశం విలువైనది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఓటుహక్కు వినియోగానికి ప్రజలు చాలామంది బద్ధకించటం గమనించాల్సిన అంశం. తెనాలి నియోజకవర్గంలో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోంది. నియోజకవర్గంలో పట్టణం, తెనాలి రూరల్ మండలం, కొల్లిపర మండలం ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,67,624 మందికి గాను సార్వత్రిక ఎన్నికల్లో 2,03,825 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 63,744 మంది ఓటర్లు పోలింగ్ కేంద్రానికి వచ్చేందుకు ఇష్టపడ లేదు. అంటే ఓటు చేయలేదు. ట్రాన్స్‌జెండర్లు 33 మంది ఓటు హక్కు కలిగివుండగా, వీరిలో 15 మంది ఓటు వేశారు. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో ఓటింగ్ 77 శాతం వరకు ఉంది. ఎన్నికల కమిషన్ సాధ్యమైనంత వరకు గరిష్టంగా ఓటు నమోదుకు తగిన ప్రచారం చేస్తూనే ఉంది. స్థానిక సబ్‌కలెక్టర్ / నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్ కూడా ఈసారి తెనాలిలో పోలింగ్ 80 శాతం పైగా వచ్చేలా కృషి చేస్తామని ప్రకటించారు కూడా! అయినా 76.16 శాతానికి మించలేదు. ఇందుకు ఓటర్ల మనస్తత్వమే కారణమని చెప్పక తప్పదు. 'సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్' (స్వీప్) అనేది ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రక్రియ. ఓటు హక్కు కలిగిన ప్రతివారు ఎన్నికల్లో ఓటు వేయాలని కోరుతూ 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా ఎన్నికల కమిషన్ ప్రతి ఎన్నికల్లోనూ ప్రచారం నిర్వహిస్తుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువతీ యువకుల నుంచి అప్పటికే ఓటు కలిగినవారు తప్పనిసరిగా ఓటు వేయాలనేది ఈ ప్రచారం సారాంశం. తెనాలి సబ్‌కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో స్వీప్ ప్రచారాన్ని ముమ్మరంగా చేయించారు. 'ఓటు హక్కును వినియోగించుకుందాం... ధర్మబద్ధమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకుందాం' అంటూ రకరకాల ప్రచారాలను చేశారు. ప్రత్యేకంగా 'బ్యాలెట్' పేరుతో లఘుచిత్రాన్ని నిర్మించారు. యువతతో 2కే రన్‌ను జరిపారు. ఇక సోషల్ మీడియాలో టీవీల్లో ప్రచారానికి అంతే లేదు. ఈ పర్యాయం 85 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే ఓటు వేసే 'హోమ్ ఓటింగ్' విధానాన్ని అమలు చేసింది. పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ మామూలే. ఇక పోలింగ్ కేంద్రాల్లో సీనియర్ సిటిజన్లకు క్యూలైనులో లేకుండా ఓటు చేసేందుకు అనుమతించారు. నడవలేని వారికోసం వీల్‌చైర్ల సదుపాయాన్ని కల్పించారు. చాలామంది పెద్దలు సంతోషంగా ఓటు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు ఎన్నడూ లేని హీట్‌ను కలిగించాయి. పొరుగు రాష్ట్రాల్లో ఉన్నవారే కాదు... విదేశాల్లో స్థిరపడిన ఎందరో సొంతూళ్లకు వచ్చి ఓటు వేసిన దృశ్యాలను ప్రతి ఊళ్లోనూ చూశాం. అయినా స్థానికుల్లో చాలామందిలో స్పందన లేదు. మొత్తం మీద నియోజకవర్గంలో 63,744 మంది ఓటు వేయలేదు. చైతన్యానికి నిలయమని చెప్పుకునే తెనాలి పట్టణంలోనే 48,833 మంది పోలింగ్ కేంద్రానికి రానేలేదు. వీరిలో పురుష ఓటర్లు 23,105 మంది ఉంటే, మహిళా ఓటర్లు 25,728 మంది ఓటు వేయలేదు. తెనాలి రూరల్ మండలంలో 64,440 ఓటర్లకుగాను 54,632 మంది మాత్రమే ఓటు వేశారు. 9,808 మంది ఓటు వేయలేదు. ఇక్కడా స్త్రీలదే అగ్రాసనం. ఓటు వేయని పురుషులు 4,545 మంది ఉంటే, మహిళలు 5,263 మంది ఓటు వేయలేదు. ఇక కొల్లిపర మండలంలో పరిస్థితి కొంతవరకు ఫర్వాలేదు.

రూరల్ మండలంతో పోల్చుకుంటే ఇక్కడ ఓటింగ్ శాతం పెరిగింది. మొత్తం 45,004 ఓటర్లకుగాను 39,901 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇక మిగిలిన 5,103 మంది ఓటు వేయలేదు. వీరిలో మహిళలు 2,985, పురుష ఓటర్లు 2,118 మంది ఉన్నారు.

ప్రజల ఆదరణ మరువలేను

ఆర్యవైశ్యుల సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



ఆర్యవైశ్య నేతలతో అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చూపిన ఆదరణను మరువలేనని వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక గంగానమ్మపేటలోని శశి డెలిషియస్‌లో గురువారం పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరయ్యారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆర్యవైశ్య సంఘీయులు వైఎస్సార్‌సీపీ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్న అంశాన్ని ఆర్యవైశ్య ప్రముఖులు అన్నాబత్తుని శివకుమార్ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల్లో ఆర్యవైశ్య సంఘీయులు తన వెన్నంటే ఉండి మద్దతు తెలిపినందుకు శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

ఆర్యవైశ్య నేతలు మాలేపాటి హరిప్రసాద్, మద్దాళి శేషాచలం, దేసు శ్రీనివాసరావు, ఉప్పల వరదరాజులు గొడవర్తి సాయి హరే రామ్, కొల్ల గురునాథ్ గుప్తా, వేమా సురేష్, కనుమర్లపూడి సుబ్రమణ్యం, శనగపల్లి నాగేశ్వరరావు, చెక్క చంద్రమోహన్, నూకల ఆదిత్య, వేమూరి కోటేశ్వరరావు, పొన్నూరు శ్యామ లరావు, ముచ్చల శ్రీనివాసరావు గుప్త, ఆతుకూరి పూర్ణచంద్రావు, ఘంటసాల సుధాకర్, భాస్కరుని లక్ష్మీనారాయణ, భాస్కరుని ప్రసాద్, నంబూరి వీరబ్రహ్మం, కాటేపల్లి భీముడు, బలబద్ర వెంకటేశ్వరరావు, అన్నవరపు మధు, అనుమాలశెట్టి మహేష్, జూటూరు వాసు, కిరణ్, యిడవలపాటి సుబ్రహ్మణ్యం, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మనసు కవి ఆత్రేయ



లక్ష్మీపురం: ప్రేమ కవి, మనసు కవిగా కీర్తించబడ్డ ఆత్రేయ రాసిన పాటలన్నీ అమృత గుళికలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఆత్రేయ జయంతి సందర్భంగా 'మనమూ పాడుదాం రండి!' బృంద సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కో–ఆర్డినేటర్ బిళ్లా అశోక్ మాట్లాడుతూ సినిమా పాటల్లో తేలికైన పదాలతో ఎంతో బరువైన భావాలను పలికించిన ఆత్రేయను సినీవేమన అనవచ్చన్నారు. గాయకుడు టి.సాయిబాబు మాట్లాడుతూ ఆత్రేయ సినిమా పాటల రచయితగా నాలు గు దశాబ్దాలపాటు తనదైన ప్రత్యేక శైలిని ప్రదర్శించారన్నారు. రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆత్రేయ కలం నుంచి వెలువడిన సినీ గీతాలు సగటు ప్రేక్షకుడిని సైతం ఆనంద డోలికల్లో ఊయలూగించాయన్నారు. అనంతరం గాయకులు మల్లేశ్వరరావు, రాజశేఖర్, అయూబ్‌ఖాన్, వెంకటేశ్వరరావులు ఆత్రేయ గీతాలు ఆలపించారు.

5 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని అల్లంవారి పాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ పుల్లారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు ఉన్న 3.15 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల పలు గ్రామాల్లో తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాన్ని తొలగించి, 5కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

18న వాసవీమాత జయంతి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని ఈనెల 18న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ దాచేపల్లి నరేంద్రకుమార్ గురువారం తెలిపారు. ఉదయం అమ్మకు విశేషంగా పంచామృతాలతో అభిషేకం అర్చకులు నిర్వహించి మల్లె పూలతో విశేష అలంకారం చేస్తారన్నారు. అనంతరం సహస్రనామాలతో కుంకుమార్చనలు నిర్వహిస్తారన్నారు. వాసవీ మహిళమండలి, గీతాభజన మండలి ఆధ్వర్యంలో కోలాటం, లలితా సహస్రనామ పారాయణం కావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమాలను జి.మధుసూధనరావు, కె.వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తారన్నారు.

438 మందికి బీసీజీ టీకాలు

ఫిరంగిపురం: మండలంలోని 438 మంది పెద్దవారికి గురువారం బీసీజీ టీకాలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలోని హెల్త్ సబ్‌సెంటర్లలో 200మందికి టీకాలు వేసినట్లు వైద్యాధికారి ఫరీనాబేగం తెలిపారు. అదేవిధంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలోని హెల్త్‌సబ్ సెంటర్లలో 238మందికి టీకాలు వేసినట్లు వైద్యాధికారి శ్వేత తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 18ఏళ్లు నిండి గడిచిన ఐదేళ్లుగా టీబీ లక్షణాలు ఉన్నవారికికూడా టీకాలు వేస్తున్నామన్నారు. అలాగే టీబీ లక్షణాలు ఇంట్లో ఉన్నవారికి కూడా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. వారంలో ప్రతి గురువారం ఆయా గ్రామాల్లోని సబ్ సెంటర్లలో బీసీజీ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

తెనాలిలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

కొల్లిపర: సార్వత్రిక ఎన్నికల్లో తెనాలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం అని తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో 20 గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులతో ఎన్నికల పోలింగ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లిపర మండలంలో గత ఎన్నికల్లో వైసీపీ కి 9 వేల మోజార్టీ వచ్చిందని, ఈ ఎన్నికల్లో కూడా గత ఎన్నికల్లో వచ్చిన విధంగా అత్యధిక మోజార్టీ వస్తుందని పార్టీ శ్రేణులు వ్యక్తం చేశారు. శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ నేతలు, కార్యకర్తలు ఎన్నికల్లో కష్టపడి పని చేశారన్నారు. రానున్న రోజుల్లో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఎన్నికల కౌంటిగ్ పూర్తి అయి, ఫలితాలు వచ్చిన తర్వాత విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని కార్యకర్తలకు సూచించారు. తొలుత ఎమ్మెల్యే సార్వత్రిక ఎన్నికల్లో వివిధ గ్రామాల్లో పోలింగ్ ఏ విధంగా జరిగింది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. సభ అనంతరం తూములూరు గ్రామంలోని దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామ కృష్ణారెడ్డిని తన గృహంలో మర్యాద పూర్వకంగా కలసి వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ జరిగిన విధానం గురించి చర్చించుకున్నారు.

వృద్ధులు బీసీజీ టీకాలు వేయించుకోవాలి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ



టీకా వేస్తున్న సిబ్బంది

తెనాలిఅర్బన్: 60 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకాలను వేయించుకోవాలని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈ.అన్నపూర్ణ సూచించారు. కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కొత్తపేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన బీసీజీ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి రాకుండా నియంత్రించేందుకు టీకా పనిచేస్తుందన్నారు. 60 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ, 18 సంవత్సరాలు నిండి పొగ తాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రస్తుతం టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అలాగే గతంలో క్షయ మందులు వాడి మానేసిన వారికి కూడా వేయడం జరుగుతుందన్నారు. తెనాలి పట్టణంలోని అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం బీసీజీ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ముందుగా తమ పేర్లు సచివాలయంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ కలగొట్ల రాధిక మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరికి బీసీజీ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. అనంతరం పలువురు వృద్ధులకు బీసీజీ టీకాలు వేశారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీజాన్, టీబీ సూపర్‌వైజర్ టి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భాగస్వామ్యంతో డెంగీని నిర్మూలిద్దాం

తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: ప్రజా భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పాత ప్రభుత్వ వైద్యశాల నుంచి గురువారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లో డెంగీ వ్యాధిపట్ల అవగాహన కల్పించి దానిని అరికట్టడమే ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశమని చెప్పారు. దోమకాటు వలన డెంగీ వ్యాధి వస్తుందని, ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ దోమ తమ గుడ్లను మంచి నీటి నిల్వల్లో పెట్టి దాని సంతతిని పెంచుకుంటుందని చెప్పారు. దోమకాటు వలన ముందుగా జ్వరం వస్తుందని చెప్పారు. ప్రజలందరూ ఇంటి పరిసరాలు, లోపల నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ బీబీజాన్ మాట్లాడుతూ జ్వరం, శరీరంపై దద్దుర్లు, పంటి చిగుర్లు, ముక్కు, చెవి నుంచి రక్తం కారడం, యూరిన్ ఎర్రగా రావడం వంటివి డెంగ్యూ లక్షణాలని తెలిపారు. అలాంటి లక్షణాలు కనిపిస్తే సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తగ్గ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలు, పూర్తి వస్త్రధారణ, దోమకాటు నుంచి రక్షణ కలిగించే వాటిని ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం శివాజీచౌక్ మీదుగా పట్టణంలో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఫైలేరియా సీనియర్ అసిస్టెంట్ జి.రవికుమార్, లెప్రసీ విభాగ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్, క్షయ వ్యాధి నివారణ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్, ఆరోగ్య సిబ్బంది ప్రసన్న, పుష్పలత, దీపాల శ్రీనివాస రావు, బందారు మల్లేశ్వర రావు, దాసరి శివనాగ మల్లేశ్వరరావు, శివరామ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది



పెరవలిలో అవగాహన ర్యాలీ చేపడుతున్న అధికారులు

రేపల్లె రూరల్: ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రవిబాబు అన్నారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓల్డ్‌టౌన్‌లోని అర్బన్ హెల్త్ సెంటరులో గురువారం నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈడెస్ జాతికి చెందిన దోమ కుట్టటంతో సంక్రమించే డెంగీ జ్వరం ప్రమాదకరమన్నారు. వ్యాధి బారిన పడిన వారిలో తీవ్ర జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మపు దద్దుర్లు కనిపిస్తాయని చెప్పారు. ఆరోగ్యం మెరుగుపడటానికి సాధారణంగా రెండు నుంచి ఏడు రోజులు పడుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యుడిని సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. నివాస గృహాల సమీపంలో నీటి నిల్వలు, తేమ వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. తేమ వాతావరణంలో దోమల ఉధృతి అధికంగా ఉండేందుకు అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ ఎల్లయ్య, హెల్త్‌సెంటర్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, సిబ్బంది శిరీష, తిరుపతమ్మ, నరేంద్ర, రామాజీ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే డెంగీ దూరం

పెరవలి(వేమూరు): డెంగీ నివారణకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి ప్రాథమిక వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణ కోసం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ప్రజలకు ప్రతి శుక్రవారం అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకట సురేష్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల ప్రాంతాల్లో తాగి పడేసిన కొబ్బరి బొండాలు, తాటి డిప్పలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటలక్ష్మి, సూపర్ వైజర్ పున్నారావుపాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన అవసరం

వైఎస్సార్ హెల్త్‌సెంటర్‌లు, పీహెచ్‌సీల ఆధ్వర్యంలో డెంగీ నివారణ అవగాహన ర్యాలీలు



గణపతినగర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఫిరంగిపురం పీహెచ్‌సీ సిబ్బంది

మంగళగిరి: డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు డాక్టర్ గీతా పద్మజ తెలిపారు. గురువారం డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాసుపత్రితో పాటు నగర పరిధిలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతా పద్మజ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో డెంగీ వ్యాధి ప్రబలకుండా ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుందని, ప్రజలు భాగస్వాములై నివారణకు సహకరించాలని కోరారు. ఇళ్ల చుట్టూ మురుగు, వర్షపు నీరు నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటే డెంగీని నివారించవచ్చన్నారు. ఇళ్ల పక్కన కొబ్బరి బొండాలు, టైర్లు, గాజు సీసాలు, ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, గ్లాసులు నీరు నిల్వ వుండే వస్తువులు లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు నిల్వ వుండే ఆవాసాలను గుర్తించి వాటిలోని నీటిని లేకుండా చేయడం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే నిర్మూలించి డెంగీ వ్యాధి వ్యాప్తి ని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంట్లు కె.శ్రీనివాసరావు, గణపతినగర్‌లో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, ఆయా హెల్త్ సెంటర్‌ల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన అవసరమని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేరురాణి అన్నారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకొని మండలకేంద్రంలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో పలుగ్రామాల ఆరోగ్యసిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధి గణపతినగర్‌లో ఇందిరానగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవ సందర్భంగా గురువారం డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు డెంగీ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డెంగ్యూ వ్యాధి లక్షణాలను వివరించారు. హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

తాడేపల్లిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎండీ ఈఏ రహమాన్ అన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో డెంగ్యూపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సి. ఇందిర, సీహెచ్‌ఓ జానమ్మ, భాగ్యలలిత కుమారి, బి. బుజ్జి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు,హెల్త్ అసిస్టెంట్ జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిలువూరులో కంటి వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో రాప్స్ బాండ్స్ ఆఫ్ లవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కొప్పుల అనిల్ బాబు జ్ఞాపకార్థం ఉచితకంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని, సుమారు 200 మంది కంటి సంబంధిత పరీక్షలు చేయించుకున్నారని, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. 160 మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. వైద్య శిబిరానికి సహకరించిన వైద్యులు వీవీ కర్ణ, ఉండవల్లి సాంబశివరావులకు ధన్యవాదాలు తెలిపారు. రాప్స్ బాండ్స్ ఆఫ్ లవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొప్పుల మరియమ్మ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.